క్లుప్తంగా

వసతిగృహంలో తనిఖీలు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: సంతవురిటి బీసీ వసతి గృహాన్ని తహసీల్దార్ మహాదేవు సరిత శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను సాధించేలా పని చేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకే మెనూ అమలు చేస్తున్నామని వార్డెన్ అప్పారావు తెలిపారు.

శ్రీముఖలింగానికి స్వాగత ద్వారం ఏర్పాటు చేయాలి



జేసీకి వినతి పత్రం అందిస్తున్న రాజశేఖర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రానికి రెండు వైపులా స్వాగత ముఖ ద్వారాలు ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, ఆలయ అనువంశిక అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్లుగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ఎప్పటికప్పుడు పాలకులు చెపుతున్నా కార్యరూపం దాల్చడం లేదన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక, కనీసం క్షేత్రం ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు.

సాంబమూర్తి సేవలకు సత్కారం



సాంబమూర్తి, అరుణ దంపతులను సన్మానిస్తున్న పీడీ, పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా, 40 ఏళ్లపాటు పీడీ, పీఈటీ సంఘానికి పెద్ద దిక్కుగా వ్యవహరించిన మెంటాడ సాంబమూర్తి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శుక్రవారం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. విద్యాశాఖ అధికారులు, వివిధ మేనేజ్‌మెంట్ స్కూళ్ల పీడీ–పీఈటీలు, మిత్రులు, శిష్యబృందం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశేషమైన సేవలు అందించారని కొనియాడారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం



పాలఖండ్యాంలో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జి.సిగడాం: పేదరికం నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పాలఖండ్యాం గ్రామంలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధారబోయిన రెయమ్మ, కామోజుల ఆరుద్ర, పలిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మంత్రి శ్రీనివాస్‌ను కలిసిన బ్యాంక్ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: స్వయం సహాయక సంఘ సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన మంత్రిని స్త్రీ నిధి ఎండీ గురుగుబెల్లి హరి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పైడి రాజా, ఎల్‌డీఎం పేడాడ శ్రీనివాసరావు తదితరులు శ్రీకాకుళంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 13, 14, 15 తేదీలలో జరిగే వేడుకలలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా మారి బ్యాంక్‌లలో రుణాలు పొందిన మహిళలకు శాంక్షన్ లెటర్ మంజూరు చేయాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో వన్ ఫ్యామిలీ, వన్ ఇంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

కాలిబాటలతో.. లాభాల బాట



వరిలో కాలిబాటలు తీస్తున్న రైతు

- ఎకరాకు 4 ధాన్యం బస్తాల వరకు అదనపు రాబడి
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఎచ్చెర్ల: ఖరీఫ్ వరిసాగుకు సంబంధించి రైతులు మెలకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అదనపు ఖర్చు అని భావించకుండా వరి పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే అదనపు దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాధారణంగా చాలామంది రైతులు సరైన అవగాహన లేక పంటలో కాలిబాటలు వేయడానికి అంతగా ప్రాధాన్యమివ్వరు. అనవసరపు ఖర్చుగా భావించి వెనుకడుగు వేస్తుంటారు. పొలంలో కాలిబాటలు వేయడానికి ఎకరాకు రూ.800 ఖర్చు పెడితే నాలుగైదు బస్తాలు దిగుబడిని అదనంగా పొందవచ్చు. తొలకరి సీజన్‌లో వరినాట్లు పూర్తవుతున్న దృష్ట్యా కాలిబాటలు వేసుకోవాల్సిందిగా సూచనలు ఇస్తున్నారు. మండలంలో గ్రామాల్లో తిరుగుతూ కాలిబాటల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు..

- పొలాల్లో ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు వెడల్పున గట్ల పక్కనుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా బాటలు వేయాలి.
- కాలిబాటల వల్ల వరిమొద్దళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించకుండా ఉంటాయి.
- బాటలకు ఇరుపక్కలా ఉన్న కుదురులు అధికంగా దుబ్బు చేస్తాయి.
- ప్రతిరోజూ బాటలవెంబడి నడుస్తూ పంటతెగుళ్లు గుర్తించడానికి కలుపు మొక్కలను ఏరివేసేందుకు వీలవుతుంది. ఎరువులు సక్రమంగా జల్లుకోవచ్చు.
- పంటతెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేయాల్సిన అవసరముంటే ముందుగా తెగులుసోకిన చోట మందులను పిచికారీ చేసి తర్వాత మిగిలినచోట చేయవచ్చు.
- బాటల వెంబడి ఎలుకల నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. ప్రతిరోజూ పొలంలో వరిపంటను సమగ్రంగా పరిశీలించవచ్చు.

దిగుబడులు అధికం

కాలిబాటలు పక్కన ఉన్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా చేయడంతో పాటు, బాటలు వెంబడి తీసిన మొనలు ఖాళీస్థలంలో ఊడ్చడం వల్ల ఎకరాకు 300 నుంచి 375 కిలోల వరకు దిగుబడిని అదనంగా పొందవచ్చు. బాటలు వేయడం వల్ల పొలంలోకి దిగి పంటకాలంలో చీడపీడలు గుర్తించి జరిగే నష్టాన్ని ముందుగానే అరికట్టి అధిక దిగుబడులు సాధించవచ్చు.

చీడపీడలు గుర్తిస్తున్నాం



గతంలో కాలిబాటలు వేయడం వల్ల అదనపు ఖర్చుగా భావించేవాళ్లం. వ్యవసాయ అధికారులు చెప్పినట్టు బాటలు తీయడం వల్ల ప్రతిరోజూ పొలంలోకి దిగి పరిశీలించడం వల్ల చీడపీడలు, ఎలక్కొట్టుడు గురించి ముందుగానే తెలుసుకోగలుతున్నాం.
– రామచంద్రరావు, రైతు, కేశవరావుపేట

అవగాహన పెరిగింది.



కాలిబాటలు వేయడం వల్ల ఉపయోగకరంగా ఉంటుందని చెప్పినా రైతులు వినిపించుకునే వారు కాదు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు రైతుల్లో చాలామార్పు వచ్చింది. ప్రతిఒక్కరూ వెదజల్లిన, ఊడ్చిన పొలాల్లో కాలిబాటలు వేస్తున్నారు. వీటివల్ల రైతులు అదనపు దిగుబడిని సాధించవచ్చు.
– వావిలాపల్లి రాజేష్, మండల వ్యవసాయాధికారి, ఎచ్చెర్ల

సీనియారిటీని పక్కన పెట్టి నియామకాలా?



గార: అంపోలు జెడ్పీ హైస్కూల్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గార: రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా సీనియారిటీని పక్కన పెట్టి ఎంఈఓ–1లను నియమించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద భోజన విరామ సమయంలో రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలు కోసం ప్రత్యేక కమిటీ ద్వారా నియామకాలు చేపట్టే విషయమై ఉపాధ్యాయ సంఘాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయటం దారుణమన్నారు. ఇది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌కు సంబంధించి కోర్టు కేసు పెండింగ్‌లో ఉండగా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం నియమించిన ఎంఈఓ–1 పోస్టులను తక్షణమే రద్దు చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.జ్యోతిలక్ష్మి, వి.చంద్రశేఖర్, సీహెచ్. లక్ష్మణరావు, కె.విజయకుమార్, టి.ధర్మారావు, కె.మాధవీలత, పి.వసుంధరాదేవి, ఎస్.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మరువాడ పాఠశాల ఉపాధ్యాయులు

ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలుచేయాలి

రణస్థలం: ఒకే డీఎస్సీ ద్వారా వచ్చిన వారికి ఒకే నింబంధన వర్తింపచేయాలని మరువాడ పాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. వివక్ష లేకుండా అందరికీ పదోన్నతులలో సమాన అవకాశాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలు వెంటనే అమలు చేయాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.శివశంకర్, ఎస్‌కే రహీమ్, టి.సురేష్, కె.ఖగేశ్వరరావు, జి.చిన్నకృష్ణంనాయుడు, వై.ప్రమీల, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రైడ్ ఆఫ్ ఇండియా ఐకాన్ ఆఫ్ ఇండియాకు–2025 జాతీయ స్థాయి పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వృద్ధులు, దివ్యాంగులు, కరోనా నివారణ సహాయ సేవకులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మికుల, కర్షకులకు ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రతిభ ఆధారంగా పురస్కారాలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. వివరాలకు 96523 47207 నంబరును సంప్రదించాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు



ఆర్‌కేనగర్‌లో రోడ్డుకు ఆనుకుని వేసిన షెడ్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న రామకృష్ణనగర్‌కాలనీలో ఓ లైన్‌లో రోడ్డుకు ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా కార్‌షెడ్డులు వేశారు. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. షెడ్డులు తొలగించాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చొరవ చూపి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..



బ్యాంకర్స్ కాలనీ శివబాలాజీ ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చనలు

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణలక్ష్మీ వ్రతాలతో గృహాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ సుకన్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర దేవాలయంలో ఉమాదేవికి సామూహిక కుంకుమపూజలు జరిగాయి. డీసీసీబీ కాలనీలో భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. బొందిలీపురం తుల్జాభవానీ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. చిందత్తనాథ క్షేత్రంలో జయలక్ష్మీ మాతృ మండలి సభ్యులచే సామూహిక లలితాసహస్రనామపారాయణ, కుంకుమ పూజలు జరిగాయి. బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో లక్ష కుంకుమార్చనలు జరిగాయి. అర్చకులు గోపినంబాళ్ల సత్యకూర్మాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంతోషిమాత ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

గార: మండల కేంద్రం గారలోని దుర్గాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకులు జాడ కొండబాబు మహిళలచే లలిత సహస్ర నామార్చనలు చేశారు. ముందుగా ఆలయ ధర్మకర్త మార్పు ధర్మారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



చిందత్తనాథ క్షేత్రంలో పూజలు



గార: సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



కోందరామాలయంలో మహాలక్ష్మికి అలంకరణ



డీసీసీబీ కాలనీలో మహాలక్ష్మి అలంకరణ



బొందిలీపురం తుల్జాభవానీ ఆలయంలో పూజలు



నక్కవీధిలో సామూహిక కుంకుమ పూజలు

మోసగించడమే చంద్రబాబు నైజం



బందరువానిపేటలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గార: నెరవేర్చలేని హామీలిచ్చి మోసం చేయటమే చంద్రబాబు నైజమని ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం గార మండలం బందరువానిపేట, సతివాడ పంచాయతీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం అమలు చేయలేమని తెలిసీ బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన ఘతన కూటమి నాయకులకే దక్కుతుందన్నారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు ప్రతినెలా ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి అవి అమలు చేయాలంటే ఇప్పుడు ఆంధ్రానే అమ్మాల్సి వస్తుందనడం విడ్డూరంగా ఉందన్నారు. అందరికీ మూడు గ్యాస్ సిలిండర్లు చెప్పటం తప్పా ఆచరణలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. పింఛన్లలో కోత విధించి దివ్యాంగులకు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు యాళ్ల నారాయణమూర్తి, గణగళ్ల రామారావు, ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, పుల్లటి నాగేశ్వరరావు, కొయ్యాన నాగభూషణం, శిమ్మ ధర్మరాజు, తమ్మిన అప్పలరాజు, గుంటు రామచంద్రరావు, బత్తుల గోవింద, పప్పు బాబూరావు, పాదిలాపు రామజోగి, కోట రామారావు, ఆరంగి సూర్య, గణగళ్ల అప్పారావు, మూర్తి, అప్పన్న, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుతంత్రాలు తిప్పికొట్టాలి



పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో వీరారెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను భయపెట్టాలని చూస్తే సహించేది లేదని, అందరం కలిసికట్టుగా ఆ కుతంత్రాలను తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పార్వతీపురం మన్యం జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జి వీరారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌లను కలిసి మాట్లాడారు. అన్ని విభాగాల నాయకులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి కూటమి వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రణస్థలం: చదువుకున్న వారే అధికంగా ఆన్‌లైన్ మోసాల వలలో పడిపోయి నష్టపోతున్నారని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి, శ్రీకాకుళం యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పైడి రాజా అన్నారు. కొముది కళాశాలలో శుక్రవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకు ఖాతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా తెరిచినప్పటి నుంచి అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తులకు ఓటీపీ తెలియజేయకూడదన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ వి.అశోక్‌కుమార్, ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు, బ్యాంక్ మేనేజర్ జి.వి.ఎస్.గౌతమ్, రిసోర్స్‌పర్సన్లు ఎస్.హరి, ఎ.హరనాథ్, ట్రైనర్లు బి.కుమారస్వామి, బి.రమణమూర్తి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గార: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్.గంగరాజు అన్నారు. శుక్రవారం శాలిహుండం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్, అపరిచిత వ్యక్తులతో పరిచయాల వల్ల కలిగే నష్టాలు వివరించారు. ఉజ్వల భవిష్యత్ కోసం చదువుపై ఏకాగ్రత, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలితకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ పోటీలు



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శ్రీకాకుళం స్టార్ బ్యూటీస్ అధినేత ప్రిస్కిల్లా గిరిరాజ్, రాధారాణి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రావణ లక్ష్మీ సంప్రదాయ పోటీలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూరలు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అనే సంవత్సరాల చరిత్ర కలిగిన గొప్ప సంప్రదాయాల కలయికని పేర్కొన్నారు. నృత్యం, సంగీతం, సంప్రదాయ వంటలలో ఒకొక్క ప్రాంతానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుందన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీఎస్‌వీ జ్యూయలర్స్, సింధూర హాస్పిటల్, సాయిబాపూజీ లేడీస్ వరల్డ్ సిబ్బంది, అతివల బృందం పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం తగదు

ఎచ్చెర్ల : బొంతలకోడూరు పంచాయతీలో పింఛన్ల పంపిణీలో సర్పంచ్‌ను అగౌరపరిచేలా సిబ్బంది, కూటమి కార్యకర్తలు వ్యవహరించారని సర్పంచ్ రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించకుండా, కొత్త పింఛన్ల పంపిణీ విషయాన్ని సర్పంచ్‌కు తెలియజేయకపోవడం అన్యాయమన్నారు. కూటమి పార్టీ కార్యకర్తలతోపంపిణీ పూర్తిచేసి ప్రజాప్రతినిధులను అవమాన పరిచేలా ప్రవర్తించడం బాధాకరమన్నారు.

కాలువ ఆక్రమణ



ఆక్రమణలకు గురవుతున్న పీడబ్ల్యూ కాలువ

శ్రీకాకుళం రూరల్ : శ్రీకాకుళం పరిధిలోని కిమ్స్ ఆస్పత్రి పరిసర ప్రాంతంలో పీడబ్ల్యూ కాలువ ఆక్రమణలకు గురవుతోంది. ఈ ప్రాంతంలో భూములకు ఇటీవల అధిక రేట్లు పలకడంతో ప్రభుత్వ ఆధీనంలో గల గట్లు, గెడ్డలు, కాలువలు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి. కొద్దిరోజుల కిందట ఇదే ప్రాంతంలో కాలువలను అనుసరించి గోడలు కట్టడంతో పాటు కొంత మంది బడ్డీకొట్టులు ఏర్పాటు చేసేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవ్వడంతో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పరిశీలించారు.